క్లుప్తంగా

పదోన్నతిపై బదిలీ

బొల్లాపల్లి : మండలంలోని వడ్డెంగుంట సచివాలయం ఉద్యాన సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డి ఉద్యాన విస్తరణ అధికారిగా పదోన్నతి పొంది ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తెనాలి ప్రాంతానికి బదిలీ అయ్యారని, ఈ మేరకు వినుకొండ ఉద్యానశాఖ అధికారి షేక్ నబిరసూల్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఉద్యాన విస్తరణ అధికారి పోస్టులు 2 మాత్రమే ఉన్నాయని చెప్పారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఎంపీపీ బత్తిరాములు

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ బత్తిరాములు హాజరై మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంలోని గ్రామీణ ప్రాంత వాసులకు మెరుగైన సేవలు అందేలా వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. పీహెచ్‌సీని అన్నివిధాల అభివృద్ధి పరిచే విధంగా ప్రతి ఏటా కేటాయించిన నిధులను సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈ ఏడాది కేటాయించిన రూ.1.75 లక్షలు నిధులను మందులు, హాస్పిటల్‌కు ఇతరత్రా అవసరమైన వస్తువుల కొనుగోలుకు ఉపయోగించనున్నట్లు వైద్యాధికారి పి.శంకరనారాయణ తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ మాఫియాను కట్టడి చేస్తాం

శావల్యాపురం: అక్రమ రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ అన్నారు. గురువారం స్థానిక పోలీసు స్టేషనులో రూరల్ సీఐ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఏల్చూరు గ్రామం నుంచి వినుకొండకు తరలిస్తున్న రేషన్ వాహనాన్ని మండలంలోని పిచికలపాలెం గ్రామ సమీపాన పోలీసులకు అందిన పక్కా సమాచారం అందింది. ఈ మేరకు ఎస్సై తుళ్లూరి తిరుపతిరావు పోలీసు సిబ్బందితో వెళ్లి వాహన డ్రైవరును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. అలాగే మండలంలోని వేల్పూరు గ్రామం ప్రధాన కూడలి మార్గంలో వైఎస్సార్ సీపీ శిలాఫలకంపై ఏర్పాటు చేసిన డిజిటల్ ఫొటోలను చించి వేసిన ఘటనపై విచారణ చేపట్టామన్నారు.

అంగన్‌వాడీకి సామగ్రి వితరణ



వినుకొండ(నూజెండ్ల): విశ్రాంత ఉద్యోగుల సేవాసంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని వెన్నపూస కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో రూ.5 వేలు విలువగల రైస్‌కుక్కర్, ఫ్యాన్లు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భువనగిరి సుబ్రమణ్యం మట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రతినెలా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతందని, తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగ సంఘం సభ్యులు సుబ్బయ వర్మ, రామలింగేశ్వరరావు, బీపీఎస్ సుందరరరావు, టి.శేషయ్యలతోపాటు పలువురు పాల్గొన్నారు.

ప్రేమగా పలకరిస్తూ... సమస్యల్ని పరిష్కరిస్తూ..

- జోరువానలోనూ కొనసాగిన గడప గడపకు కార్యక్రమం
- ఉన్నవలో ఉత్సాహంగా పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్న మంత్రి విడదల రజిని



పథకాలను వివరిస్తున్న మంత్రి విడదల రజిని

యడ్లపాడు: నవరత్న సంక్షేమ పథకాలే జగనన్న అస్త్రాలని... పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చేసుకుని నవరత్న సంక్షేమ పథకాలే అస్త్రాలుగా చేసుకుని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పారదర్శక పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గురువారం ఉన్నవ గ్రామంలో రెండోరోజు గడపగడపకూ కార్యక్రమంలో మంత్రి విడదల రజిని పాల్గొన్నారు. ముందుగా వైఎస్సార్ సీపీ నాయకులు మంత్రి రజినికి సాదర స్వాగతం పలికారు. ఒక వైపు వర్షం కురుస్తున్నా మంత్రి రజిని పార్టీ శ్రేణులతో కలిసి ఉదయపురి కాలనీ నుంచి ఇంటింటి కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామంలోనూ పర్యటించారు. ప్రతి ఇంటి ముంగిటకు వెళ్లి అక్కా అవ్వ తాత అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ పథకాలు అందాయా అంటూ ఆరా తీశారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి గ్రామస్తులకు చేకూరిన లబ్ధి వివరాల కరపత్రాలను పంచుతూ ఇంకా అర్హత ఉండి ఎవరికైనా పథకాలు రాకుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే గ్రామంలోని సమస్యలు గురించి తెలుసుకుంటూ సంబంధిత అధికారులకు వాటిని పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారు.

అన్ని వర్గాల అభ్యున్నతి

రాష్ట్రంలో వినూత్న సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం, వ్యవసాయ తదితర రంగాల్లో ఎన్నో విప్లవాత్మక మార్పుల్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని మంత్రి రజిని కొనియాడారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరోనా క్లిష్ట పరిస్థితుల్ని అధిగమించి, దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న 5వ రాష్ట్రంగా ఏపీని నిలిపిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సిద్ధంచేలా..భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌రాసిన రాజ్యాంగాన్ని దిక్సూచిగా చేసుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు తావులేని పారదర్శకమైన పాలన అందిస్తున్నామన్నారు. కుల, మత, పార్టీ, వర్గ బేధాల వివక్ష లేకుండా అర్హత ఉన్న పేదలందరికీ సంక్షేమ పథకాలను వారి ఇంటి ముంగిటనే అందిస్తున్నామని వెల్లడించారు. వివిధ రంగాల్లో తమ ప్రభుత్వం సాధించిన ప్రగతిని గ్రామస్తులకు వివరించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్న ముఖ్యమంత్రికి అన్ని వర్గాల ప్రజలు అండగా ఉండాలన్నారు. పేదరిక నిర్మూలనే పరమావధిగా భావించి పాలించే జగనన్న నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి, రాష్ట్ర ప్రగతి కోసం జగనన్నను మరోమారు ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు ఘంటా శంకర్, జెడ్పీటీసీ సభ్యులు ముక్తా వాసు, సొసైటీ చైర్మన్లు ఓరుగంటి పూర్ణయ్య, వెంకటరెడ్డి, సర్పంచ్ దంటూ సరళా, రామారావు, ఉపసర్పంచ్ చాగంటి శ్రీధర్, ఎంపీటీసీ సభ్యులు గుత్తి రమాదేవి, యడ్లపల్లి సత్యవతి, వైఎస్సార్‌సీపీ నాయకులు సామినేని రాఘవ, గళ్లా ప్రభాకర్, వెంకట్రావు, దంటూ ఏసోబు, ప్రత్తిపాటి సంగీతరావు, మేడా వెంకటేశ్వర్లు, చట్టు సాంబశివరావు, శ్రీరామమూర్తి, రాజుపాలెం చినరమణయ్య, కాకుమాను విజయ్, సాయికృష్ణ, వలేటి ఉదయ్‌కిరణ్, ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, పావులూరి వాసు, ముజాఫా, జంగా ప్రసన్న, ఎం.విజయబాలచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- ఏరియా ఆసుపత్రి ఆకస్మిక సందర్శన
- జనరల్ వార్డు రోగులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా



జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న బాలింతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పల్నాడురోడ్డులోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని వైద్యులు, వైద్య సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న మందులు, మౌలిక వసతుల వివరాలను తెలుసుకున్నారు. వార్డుల వెంట తిరిగి చికిత్స పొందుతున్న రోగులను, వారి బంధువులను ప్రశ్నించి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య రంగంలో ముఖ్యమంత్రి సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 44 వేల మంది వైద్యులను నియమించి ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్యులే గ్రామాలను సందర్శించి రోగులను పరీక్షించి మందులు అందిస్తున్నారని తెలిపారు. సెమీ థెరపీ ద్వారా గుండె సంబంధిత వ్యాధులపై దృష్టి సారించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రూ.40 వేలు ఖరీదు చేసే ఇంజక్షన్‌ను గుండెపోటు వచ్చిన వారికి వెంటనే అందేలా అందుబాటులో ఉంచారని తెలిపారు. నరసరావుపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది గణనీయంగా పెరిగారని తెలిపారు. గతంలో వైద్య సిబ్బంది 15 మంది ఉంటే ప్రస్తుతం 45 మంది పనిచేస్తున్నారన్నారు. అలాగే వైద్యులు సంఖ్య కూడా పెరిగి 35 మంది డాక్టర్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. మరోవైపు ఆసుపత్రిలో నిర్వహిస్తున్న కాన్పులు, ఆపరేషన్ల సంఖ్య 300కు పైగా దాటిందని తెలిపారు. గైనకాలజిస్ట్ 24 గంటలు అందుబాటులో ఉంటున్నారని వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ డి.సి.హెచ్.రంగారావు, డాక్టర్ శేషిరెడ్డి, డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాస రెడ్డి, నోడల్ అధికారి హనుమనాయక్ తదితరులు ఉన్నారు.

నాదెండ్ల పశువైద్య కేంద్రంలో జేసీ తనిఖీ



నాదెండ్లలో పశువైద్యులతో మాట్లాడుతున్న జేసీ శ్యాంప్రసాద్

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలోని పశువైద్య కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. పాడి రైతులతో మాట్లాడారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని వేగంగా పాడి రైతులకు చేరవేయాలని ఆదేశించారు. పాడి రైతులకు వైద్య సిబ్బంది చేస్తున్న సేవలను అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. వైద్య సేవలు అందిస్తున్న తీరును స్వయంగా రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జగనన్న పాల వెల్లువ పురుగతిని అడిగి తెలుసుకుని, దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో మందులు, పరికరాలు, నిర్వహణ తదితర అంశాలపై స్థానిక వైద్యాధికారి డాక్టర్ ఏడుకొండలుకు సూచనలు చేశారు. పశువుల్లో సీజనల్ వ్యాధుల నివారణకు మందులు సిద్ధం చేసుకోవాలన్నారు.

జగనన్న పాలవెల్లువ పురోగతి పెంచాలి

శావల్యాపురం: జగనన్న పాలవెల్లువ కార్యక్రమం సర్వే పురోగతి వేగవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో ప్రభుత్వ పథకాల నిర్వహణ తీరుపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ పురోగతిపై ఆయా గ్రామాల్లోని వలంటీర్ల సహకారంతో వైఎస్సార్ క్రాంతి పథకం సీసీలు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. స్త్రీనిధి ఏజీఎం రంతు చినబుల్లెయ్య మాట్లాడుతూ స్త్రీనిధి రుణాల రీకవరీ నూరు శాతం చేయాలన్నారు.మండలంలో ఇప్పటి వరకు రూ. ఒక కోటి 72 లక్షల రుణాలను మహిళా సభ్యులకు మంజూరు చేశామన్నారు. వినుకొండ క్లస్టర్ సీసీ కృష్ణ మాట్లాడుతూ భవిష్యత్‌లో అన్నీ గ్రూపులు ఎ గ్రేడులో ఉండే విధంగా చూడాలన్నారు. పుస్తక నిర్వాహణ క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో పశువైద్యాధికారి పి.గణేష్‌కుమార్. ఏపీయం జి.వాసుబాబు, సీసీలు గొట్టం రమాదేవి, ఖాజావలీ, బేబిరాణి, యానిమేటర్లు, గ్రామసమాఖ్య మహిళా సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ అంజిరెడ్డి ఆస్పత్రిలో 100 మందికి స్టంట్స్ అమరిక



డాక్టర్ శబరిగిరీష్‌కు అభినందనలు తెలియచేస్తున్న హాస్పిటల్ సిబ్బంది

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డులోని డాక్టర్ అంజిరెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లో ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కోట శబరిగిరీష్ ఆధ్వర్యంలో 100మంది హార్ట్ పేషంట్స్‌కు పిటిసి ప్రోసీజర్స్ (స్టంట్స్ అమరిక) పూర్తి చేసిన సందర్భంగా ఆసుపత్రిలో గురువారం రాత్రి అభినందన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా డాక్టర్ శబరిగిరీష్ ఆధ్వర్యంలో 100 మంది రోగులకు స్టంట్స్ అమరికను విజయవంతంగా పూర్తిచేశారు.

ఈసందర్భంగా డాక్టర్ అంజిరెడ్డి హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి సైనింగ్ అవార్డు గ్రహీత డాక్టర్ శబరిగిరీష్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పల్నాడుజిల్లా, పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రాంతవాసులకు అడ్వాన్స్‌డ్ కార్డియాలజీ సేవలు అందిస్తూ అతి తక్కువ కాలంలోనే పేరు ప్రఖ్యాతలు సంపాదించారని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

హైవే వెంబడి మురుగు పారుదలకు పనులు



నాదెండ్ల: చిలకలూరిపేట పట్టణం నుంచి జాతీయ రహదారి వెంబడి కుప్పగంజివాగుకు మురుగునీరు పారుదలకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. కొద్దిపాటి వర్షానికే పట్టణంలోని కొన్ని ప్రాంతాలు జలమయమౌతుండటంతో అధికారులు రెండు రోజులుగా మురుగునీరు పారుదల మెరుగుపర్చేందుకు పనులు ప్రారంభించారు. ఏఎంజీ ఎదురుగా కుప్పగంజివాగు వరకూ పొక్లయినర్‌తో కాలువలకు అడ్డుగా ఉన్న వ్యర్థాలు తొలగిస్తున్నారు. గణపవరం వెళ్లే డొంక రోడ్డుపై మురుగునీరు చేరి స్థానికుల నుండి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో మురుగు పారుదలకు పనులు చేస్తున్నారు. గురువారం ఆయా పనులను మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, అధికారులు పరిశీలించారు.

ఓటర్ల జాబితాలో అవకతవకలు రానివ్వద్దు



చిలకలూరిపేట టౌన్: ఓట్ల నమోదు, ఓటర్ల జాబితాలో అవకతవకలకు తావివ్వకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు చెప్పారు. గురువారం పట్టణ పరిధిలో నాలుగు పోలింగ్ కేంద్రాల పరిధిలో అభ్యంతరాలను స్వీకరించి, ప్రజలతో మాట్లాడారు. ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలోని ఓటర్ల జాబితాను, ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి కె.సునీత, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రీసర్వే పనులపై జేసీ సమీక్ష



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ శ్యాంప్రసాద్

నాదెండ్ల: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూరక్ష కార్యక్రమంలో భాగంగా రీసర్వే పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రమైన నాదెండ్లలోని తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. రెండో విడతలో మండలంలోని తూబాడు, నాదెండ్ల గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. అనంతరం రెవెన్యూ, సర్వేయర్లు, వీఆర్వోలతో సమావేశమయ్యారు. గ్రామ సర్వేయర్ల లాగిన్‌లో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీఆర్వో లాగిన్‌లో చేర్చిన రెవెన్యూ అంశాలపై మాట్లాడారు. ప్రస్తుతం ఈ గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్‌పనులు పూర్తయ్యాయని, సర్వే నెంబర్ల ప్రకారం వ్యత్యాసాలు ఉన్నట్లయితే గ్రామ సభల ద్వారా పరిష్కరించాలని ఆదేశించారు. నిర్దేశించిన సమయంలో పక్కా ప్రణాళికతో రీసర్వే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రమణ, మండల సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, డీటీ అనురాధ, ఆర్‌ఐ రమీజా, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

చిలకలూరిపేటటౌన్: మండలంలోని గోవిందపురం గ్రామ రీసర్వే పనులను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా భూముల హద్దురాళ్లు నాటే ప్రక్రియను పరిశీలించి, సంబంధిత రెవెన్యూ అధికారులతో ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన హద్దు రాళ్లు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.సుజాత, మండల సర్వేయర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో వైఎస్సార్ జలకళ బోర్లు ప్రారంభం



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామంలో వైఎస్సార్ జలకళ బోర్లను మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన రైతు గొంగటి శ్రీనివాసరెడ్డి పొలంలో బోర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రైతుకోసం ప్రవేశపెట్టిన వైఎస్సార్ జలకళ పథకం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఉప్పలపాడు గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 25 బోర్లు మంజూరైనట్లు తెలిపారు. అలాగే మోటార్లకు విద్యుత్ లైన్లు కూడా అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కట్టింపూడి ఆదిలక్ష్మీ, ఎంపీటీసీ దూపాటి వెంకటమ్మ, జెక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సచివాలయం కన్వీనర్ జీనేపల్లి నాగరాజులతోపాటు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అచ్చంపేట: బైకును ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన స్థానిక తాళ్లచెరువు మలుపులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాళ్లచెరువు చెందిన బత్తుల శ్రీనివాసరావు(40) అచ్చంపేటలో ఉంటున్న అక్క మల్లెల రమణను బైకుపై స్వగ్రామానికి తీసుకెళుతున్నారు. తాళ్లచెరువు మలుపులోకి వెళ్లేసరికి పెట్రోలు బంకు నుంచి వచ్చే మరో బైకును తప్పించే క్రమంలో శ్రీనివాసరావు ప్రయాణిస్తున్న బైక్‌ను మాదిపాడు వైపు నుంచి వచ్చే ట్రాక్టరు ఢీకొట్టింది. శ్రీనివాసరావుకు తీవ్ర రక్త స్రావమవడంతో 108 అంబులెన్స్‌లో సత్తెనపల్లి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. అక్క మల్లెల రమణకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. అచ్చంపేట ఎస్‌ఐ సీహెచ్. మణికృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సిరి సంపదలిచ్చే మాసం శ్రావణం

- సెప్టెంబర్ 15 వరకు విశేష పూజలు, వ్రతాలు, పండుగలు
- తెలుగింట మోగనున్న భాజాభజంత్రీలు



పూజలకు ముస్తాబైన లక్ష్మీదేవి అమ్మవారు



కల్యాణ వేడుకల్లోని ఓ ఘట్టం

యడ్లపాడు: సకల శుభాలకు నిలయమైన శ్రావణ మాసం వచ్చేసింది. ఈ మాసంలో తొలకరి చిరుజల్లులతో వర్షాకాలం ప్రారంభమై ఎండిన చెట్ల కొమ్మలు సైతం తిరిగి చిగురిస్తాయి. బుధవారం వచ్చిన అమావాస్యతో ఆషాఢమాసం ముగిసి శ్రావణం ప్రారంభమైంది. నిజ శ్రావణమాసం గురువారం నుంచి మొదలై సెప్టెంబర్ 15 వరకు ఉంటుంది. సనాతన ధర్మశాస్త్ర ప్రకారం తెలుగు వారు అనుసరించే 12 మాసాల్లో ఐదవది శ్రావణమాసం. ఈనెలలో పౌర్ణమినాడు చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరించడంతో ఈ మాసానికి శ్రావణం అనే పేరొచ్చింది.

శ్రావణ శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు

శ్రావణం శుభకరమని, సిరిసంపదలను ఒసగే పర్వదినాలను మోసుకొచ్చే ఈ పవిత్ర మాసం కోసం అందరూ ఎదురు చూస్తుండడం పరిపాటి. ప్రధానంగా ఈ నెలలో వచ్చే శుక్రవారం నాడు మహిళలు అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేస్తారు. కుటుంబమంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ లక్ష్మీ పూజలు ఘనంగా నిర్వహిస్తారు.

ఆలయాలు సిద్ధం

శ్రావణమాసం సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా పలు అమ్మవారి ఆలయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణలతో సిద్ధం చేస్తున్నారు. కొన్ని ప్రధాన ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేయనున్నారు. ఈనెలలో 18,25 తేదీలు, సెప్టెంబర్ నెలలోని 1,8,15 తేదీల్లో వచ్చే శుక్రవారాలలో మహిళల సామూహిక వరలక్ష్మీ పూజలు నిర్వహణకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రధాన ఆలయాలు సిద్ధం చేస్తున్నారు.

సుముహూర్తాలు షురూ

శుభకార్యాలను పూర్తిగా దూరం పెట్టిన ఆషాఢం..ఆపైన వచ్చిన అధిక శ్రావణమాసం ముగిసి గురువారం నుంచి నిజశ్రావణం ప్రారంభమైంది. గత రెండు నెలలుగా పెళ్లిళ్లకు ముహూర్తాలు లేక వధూవరుల తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులకు శ్రావణం చెక్ పెట్టనుంది. ఈనెల 19 నుంచి డిసెంబర్ వరకు వరుస ముహూర్తాలు ఉండటంతో పెళ్లి సందడి మొదలైంది. ఈనెల 19 నుంచి దాదాపు పది రోజుల పాటు వరుసగా వివాహ ముహూర్తాలు ఉన్నాయి. ఇవి సెప్టెంబరు 10 వరకు కొనసాగి మళ్లీ అక్టోబరు 18 నుంచి ఆరంభమై డిసెంబరు నెలాఖరు వరకు కొనసాగనున్నాయి. పెళ్లిబాజాలు మోగుతుండటంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందరికో ఉపాధి లభించనుంది.

ముఖ్యపండుగలు ఈనెలలోనే...

ఈ మాసంలో వివాహ శుభ ముహూర్తాలతో పాటు పలు రానున్నాయి. ఈనెల 21న నాగుల చవితి, గరుడ పంచమి రాకతో ప్రధాన పండుగలు ఆరంభం కానున్నాయి. 22న మంగళగౌరీ వ్రతాలు, 25న వరలక్ష్మీ వ్రతం, 31న రాఖీ పూర్ణిమ, ఈనెల చివరిలో 31 నుంచి మూడు రోజులు రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు, సెప్టెంబర్ 6న శ్రీకృష్ణాష్టమి, 14న పొలాల అమావాస్యతో నిజశ్రావణంలో వచ్చే పండుగలు ముగిసి తరువాత ఆరంభమయ్యే భాద్రపదంలో ప్రవేశిస్తాయి.

పవిత్రం..శుభప్రదం...



మహాలక్ష్మీ అమ్మవారికి ఇష్టమైన మాసం ఇది. విష్ణుమూర్తి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రం ఇదే మాసంలో రావడంతో ఇరువురికి ప్రీతికరమైన మాసం ఇది. అందుకే ఎంతో పవిత్రమైనది, శుభకరమైనది. ఈ మాసంలో జరుపుకునే ముఖ్యమైన పండుగలు ఆనందోత్సాహాన్ని ఇస్తాయి. అలాగే బంధాలు, బాంధవ్యాలను పెంపొందిస్తాయి.

–పర్చూరి రాఘవేంద్ర, పండితులు, చెంఘీజ్‌ఖాన్‌పేట

మంచి ముహూర్తాలు



ఈ మాసం ఆధ్యాత్మికంతో పాటు పర్వదినాలు, శుభ కార్యాలకు నిలయం. ఏప్రిల్ నెల నుంచి శుభకార్యాలు లేవు. జులై ఆషాఢమాసం రావడంతో పెళ్లిళ్లకు బ్రేక్ పడింది. ఆగస్టు నెలలో 19, 20, 22, 24, 26, 29, 30, 31, సెప్టెంబర్ 1, 2, 3, 7, 8 తేదీల్లో వివాహ ముహూర్తాలు ఉన్నాయి. ప్రకృతి పరంగానూ శ్రావణ మాసం ఎంతో ఉపయోగం.

–స్వర్ణ రమణకుమార్, అర్చకులు బోయపాలెం

కళాశాల ఎదుట ఆందోళన

నరసరావుపేట టౌన్: ప్రైవేటు కళాశాలలో చదువుకునే విద్యార్థిని అదృశ్యమైన కేసులో సదరు విద్యార్థిని బంధువులు గురువారం రాత్రి ఓ ప్రైవేటు కళాశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. తమ బాలిక కనపడకుండా పోవటానికి కళాశాల యాజమాన్యమే కారణమంటూ వారు ఆరోపించారు. ఇంటి వద్ద నుంచి కళాశాల బస్సులో బయలుదేరిన తమ బిడ్డ తిరిగి ఇంటికి రాలేదనీ, కళాశాలకు ఫోన్‌చేస్తే బస్సులో ఇంటికి వెళ్లిందని సమాధానం చెప్పారని తెలిపారు. తాము తమ బంధువులను విచారించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పోలీసు విచారణలో అసలు కళాశాలకు రాలేదని తేలిందన్నారు. విద్యార్థిని కళాశాలకు రాకుంటే తల్లిదండ్రులకు తెలియచేయాల్సిన యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించటం వల్లే తమ బిడ్డ కనిపించకుండా పోయిందని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగినట్టు తెలిపారు.

కొనకంచివారిపాలెంలో ప్రతిష్ఠా కార్యక్రమాలు



ప్రతిష్ఠా మహోత్సవానికి బయలుదేరిన భక్తులు

రొంపిచర్ల: మండలంలోని కొనకంచి వారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోవిందాంబ సమేత శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి పరివార దేవతా ప్రతిష్ఠామహోత్సవం కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, వాస్తుహోమం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రణయణం, హారతి, ప్రధాన దేవతా శాంతి కుంభఅసాధన, ధ్యానపూర్వక కళావాహనం, లఘుపూర్ణాహుతి హారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు నారాయణం వెంకట హనుమంతాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా, పలువురు రుత్విక్‌లు పాల్గొని పూజా, హోమ కార్యక్రమాల నిర్వహించారు.

ఆలయ పునర్ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట ఈస్ట్: ఇస్సప్పాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు పట్టణానికి చెందిన గుణి మణిదీప్, భాగ్యలక్ష్మీ దంపతులు రూ.50 వేలు ఆలయ ఈఓ టి.సుధాకరరెడ్డికి అందించారు. తమ కుమారుడు సాయివేదాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకొన్న అనంతరం విరాళంను అందించారు.